విశాలాంధ్ర విశాఖపట్నం
బుధవారం 28, ఆగస్టు, 2024

ఆనందపురంలో అన్నా క్యాంటీన్లు తెరవాలి

విశాలాంధ్ర - ఆనందపురం: పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను ఆనందపురంలో తెరవాలని కోరుతూ తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు మున్సిపల్ మంత్రి నారాయణకు వినతి పత్రం సమర్పించారు. ఆనందపురం మండలం పరిసర ప్రాంతాల్లో పూల మార్కెట్‌పై జీవనం కొనసాగిస్తున్న లేబర్ ఎక్కువగా ఉండడం వల్ల వారికి ఆహార భద్రత నిమిత్తం అన్న క్యాంటీన్లను తెరవాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావుకు మంగళవారం వినతి అందించారు. ఈ కార్యక్రమంలో భీమిలి టిడిపి ఇన్చార్జ్ కోరాడ రాజబాబు, తాట్రాజు అప్పారావు, మద్ది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటును ఆధునీకరించండి

త్వరలో టిడిఆర్ బాండ్లపై నివేదిక
సెప్టెంబర్ 13న మరో 75 అన్నా క్యాంటీన్లు ప్రారంభోత్సవం
రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జి.వి.యం.సి పరిధిలో గల కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ వద్ద వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లో దుర్వాసన కలుగకుండా ఆధునీకరిం చుటకు చర్యలు చేపట్టేలా జిందాల్ ప్రతినిధులకు ఆదేశించాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్‌ను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. మంగళవారం ఆయన విశాఖ జిల్లా మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ చేపట్టే పలు కార్యక్రమాలపై సమీక్షించేందుకు విశాఖ నగర సందర్శనలో భాగంగా విశాఖ కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌లోని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను, బయోమైనింగ్ ప్లాంటును భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, శాసన మండలి సభ్యులు దువ్వారపు రామారావు, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపులప్పాడ డంపింగ్ యార్డ్‌లో దుర్వాసన కలుగకుండా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను ఆధునీకరించాలని అధికారులకు, జిందాల్ ప్రతినిధులకు ఆదేశించారు. అలాగే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటులో సేకరించిన వ్యర్ధాల నుండి విద్యుత్తు తయారీ ప్రక్రియను, టిప్పింగ్ ఫ్లోర్, ఎం ఎస్ డబ్ల్యు పిట్, క్రాబ్ క్రేన్ కంట్రోల్ రూమ్, 25 మీటర్ల ఎత్తు ఉన్న ప్లాట్‌ఫారమ్‌లో రెండు బాయిలర్లు, లెచాట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఫ్లూ గ్యాస్ క్లీనింగ్ సిస్టమ్, చిమ్నీ, టీజీ హాల్, డీసీఎస్ కంట్రోల్ రూమ్, మోటార్ కంట్రోల్ రూమ్, బాటమ్ యాష్ కన్వేయర్ మొదలైన వాటి పనితీరును, విధానాలను పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతంలో టోక్యో, జపాన్, సింగపూర్ తదితర దేశాల్లో పర్యటించి వ్యర్ధాల సేకరణ వాటి వినియోగం పునరుత్పత్తి మొదలైనవి అధ్యయనం చేశామని, 100 అంతస్తుల అపార్ట్మెంట్లు వున్న మధ్యలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లు ఉన్నాయని, అవి ఎక్కడా కూడా దుర్వాసన వెదజల్లదని, ఆ విధంగా విశాఖ ప్రజలకు ఎటువంటి హాని, దుర్వాసన కలుగకుండా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటును ఆధునీకరించాలని అధికారులకు ఆదేశించారు. 13 ఉమ్మడి జిల్లాల్లో 13 వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన అని, 1,500 టన్నుల సామర్థ్యంతో విశాఖ ప్లాంట్, వెయ్యి టన్నుల సామర్థ్యంతో గుంటూరు ప్లాంట్ ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్నా యన్నారు. చైనా, జపాన్‌లలో భారీ భవంతుల మధ్యనే డంపింగ్ యార్డులు ఉంటాయి గానీ ఎలాంటి దుర్వాసన రాదన్నారు. కానీ విశాఖ ప్లాంట్ లో మాత్రం ఇంకా కొంత దుర్వాసన వస్తోందని, అది కూడా రాకుండా చూడాలని జిందాల్ సంస్థను ఆదేశించారు. 15 వ ఫైనాన్స్ కమిషన్ మొదటి విడతలో రాష్ట్రానికి విడుదల చేసిన రూ.454 కోట్ల నిధులు మున్సిపాలిటీలకు ఖర్చు చేయచేయకపోవడంతో రెండో విడత రూ.300 కోట్ల నిధులు విడుదల కాలేదన్నారు. 2021లో రూ.298 కోట్ల స్వచ్ఛ భారత్ నిధులకు మ్యాచింగ్ గ్రాంట్ పూర్తిగా ఇవ్వకపోవడంతో మురిగిపోయాయని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిపోయిన కేంద్ర నిధులను రప్పించే ప్రయత్నం చేస్తున్నాం అన్నారు. తణుకులో రూ.59 కోట్ల టి.డి.ఆర్. బాండ్లకు గాను రూ.730 కోట్ల బాండ్లను విడుదల చేశారని, కోర్టు ఆదేశాల ప్రకారం అక్రమ టి.డి.ఆర్.లపై కమిటీలు నియమించామని, వచ్చే నెలాఖరుకు టి.డి.ఆర్. వ్యవహారం ఒక కొలిక్కి వస్తుందన్నారు. 203 అన్న క్యాంటీన్లలో 202 భవనాలు సిద్ధంగా ఉన్నాయని, ఆగస్టు 15న 100 క్యాంటీన్లు ప్రారంభించామని, సెప్టెంబర్ 13న మరో 75 ప్రారంభించ నున్నామన్నారు. ఇసుక కొరత సమస్య అక్టోబర్ 15 నాటికి తీరుతుందన్నారు. రుషికొండ భవనాలు దేనికి వాడాలనేది ముఖ్యమంత్రి నిర్ణయిస్తారని, పార్కులు, ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలను తొందర్లో కూల్చేస్తాం అన్నారు.

భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరం నుండి దాదాపు 1000 టన్నుల వరకు వ్యర్థాలు సేకరించడం జరుగుతుందని, దీనిని పలు విభాగాలుగా విభజించి విద్యుత్ ఉత్పత్తి, సేంద్రియ ఎరువు, బ్రిక్స్ మొదలైన విధాలుగా తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మున్సిపల్ మంత్రి బయో మైనింగ్ ప్లాంటును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో జివిఎంసి తెలుగుదేశం పార్టీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పిసిని వరహాలక్ష్మి నరసింహం, మొల్లి హేమలత, వి.ఎం.ఆర్.డి.ఎ. జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర, ప్రధాన ఇంజనీరు వినయ్ కుమార్, జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, సి.ఎం.ఒ.హెచ్. డాక్టర్ నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజనీరు (మెకానికల్) కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ రిజిస్ట్రార్‌ను కలిసిన టీఎన్‌టీయూసీ ప్రతినిధులు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర యూనివర్సిటీకి నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ఈఎన్ ధనుంజయరావుకి అభినందనలు తెలుపుతూ ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటీ అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరడం జరిగింది. ఈ కార్య క్రమంలో సంఘ సభ్యులు పీతల అమరేంద్ర, బండారి దేవుడు, ఒమ్మి నూకరాజు, సాయి బలరాం, ఆవాల రమేష్, చిరంజీవి, పైడిరాజు, యాసిన్ బాబా తదితరులు పాల్గొన్నారు

భూ బాధితులకు న్యాయం చేయాలి: సీపీఐ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: రాష్ట్రంలో భూ బకాసురులు ఆక్రమించిన భూములపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించి, భూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పెద గంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన విజయవాడలో రాష్ట్ర సీపీఐ ఆధ్వర్యంలో భూ బాధితుల రాష్ట్ర సదస్సు జరుగుతుందని అన్నారు. ఈ సదస్సులో భూ బాధితులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గోడ పత్రికలు ఆవిష్కరించిన వారిలో సీపీఐ నాయకులు ఎల్లేటి శ్రీనివాస రావు, జి.ఆనంద్, పల్లేటి పోలయ్య, కె.అచ్యుతరావు, పి.దుర్గారావు, కె.పోతన్న, అప్పారీ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వం మారినా ప్రాపకం మారలేదు

- తెలుగు శక్తి అధ్యక్షులు బివి రామ్

విశాలాంధ్ర - గాజువాక: ప్రభుత్వం మారి 2 నెలలు అయిందని, ఏపీ అధికార యంత్రాంగంలో మాత్రం పాత పోకడలే కనిపిస్తున్నాయని తెలుగు శక్తి అధ్యక్షులు బివి రామ్ అన్నారు. గాజువాక ఓ ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు చెందిన కట్టడాలను కూల్చి వేసిన ఘటనలను గుర్తు చేశారు. ఇప్పుడు మాజీ మంత్రి అమర్ విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. పంతులు గారి మేడ సమీపంలో అక్రమ కట్టడాన్ని విశ్లేషిస్తూ ఆయన ఈ సంగతులు వివరించారు. ఈ కార్యక్రమంలో జి.వెంకటరామయ్య, ఆవిరి సత్యనారాయణ, బోలినేని వెంకటేశ్వరరావు, విష్ణువర్ధన్ గుమ్మడి నరేంద్ర, ఏ.మణికుమార్, మండవ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో కృష్ణాష్టమి

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి బేడా మండపంలో పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం శ్రీకృష్ణుని జనన ఘట్టాన్ని వీనుల విందుగా అర్చక స్వాములు చేశారు. అదేవిధంగా కృష్ణాపురం గోశాలలో ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి గో పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు జి.శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు రాజగోపాల్, ఈఓ మాట్లాడుతూ భారతీయ పురాణాల్లో సైతం ఆవుకు ఓ ప్రత్యేక స్థానం ఉందని, ఇప్పుడు దేశంలో గో సంరక్షణ పేరుతో అనేక గోశాలల ద్వారా ఆవులను సంరక్షిస్తున్నారన్నారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధన

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని శ్రీ కృష్ణాష్టమి పర్వదినాను పురస్కరించుకొని రెండో రోజు మంగళవారం శ్రీ విజ్ఞాన మండలి యాదవ సంఘం మల్కాపురం ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అదేవిధంగా ఏడు గుండ్ల కోడలి వద్ద గల శ్రీకృష్ణ మందిరంలో చిన్నారులు శ్రీకృష్ణ వేషధారణలో వివిధ సంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకన్నపాలెం కృష్ణ మందిర్లో ఉయ్యాల సేవ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఎస్ బేబీ డాన్స్ వంటి కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

మద్ది గ్రామంలో ఫీవర్ సర్వే

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం మద్ది గ్రామంలో సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని మండల ఎంపీపీ కంటుబోతు రాంబాబు చొరవతో రేవిడి పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో రక్త నమూనా పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేవిడి పిహెచ్‌సి స్టాఫ్, మద్ది ఏఎన్ఎం, ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువను తలపిస్తున్న రోడ్లు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి నియోజకవర్గంలోని భీమిలి మండలం తాటితూరు పంచాయతీ గ్రామంలో కల్లాల రోడ్లు మురుగునీరు కాలువలతో నిండి మురుగు కాలువను తలపిస్తున్నాయి. తాటితురు గ్రామ పంచాయతీ పరిధిలో గల పల్లంటి వారి కల్లాలు దగ్గర దారి దుస్థితి చాలా ఘోరంగా ఉంది. ఎంత మంది నాయకులకు ఫిర్యాదు చేసిన సరే మాకు నడవటానికి సరైన దారిని ఏర్పాటు చేయడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరును కాలువకు మళ్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - విశాఖ: వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని గురజాడ కళాక్షేత్రంలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు జయప్రదం చేయాలని కోరుతూ సీపీఐ భీమిలి పట్టణ నాయకులు మంగళవారం పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ భీమిలి పట్టణ కార్యదర్శి కానూరి రాంబాబు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ని సెయిల్‌లో విలీనం చేయాలని, స్టీల్ ప్లాంట్ నిర్వాసితులకు న్యాయం చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, స్కీం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొండపు ఈశ్వరరావు, చిల్ల అప్పలసూరి, సీనియర్ నాయకులు అల్లు బాబురావు, మాజీ కౌన్సిలర్ మావూరి సన్యాసమ్మ, మోరా అప్పలరాజు, అప్పలసూరి, వీర్రాజు, సన్నిబాబు, గోవింద, వెంకటరావు, ఆది, రామారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సిటీ: సెప్టెంబరు ఒకటి నుండి మూడు వరకు విశాఖలో జరుగు ఏఐటియుసి జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం ఉదయం 11 గంటలకి ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక

విధానాలపై అనేక ఉద్యమ పోరాటాలు నిర్వహించే ఘన చరిత్ర ఏఐటీయూసీకి ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలను భారీగా పెంచి రవాణా రంగాన్ని దివాలా తీస్తుందని మండి పడ్డారు. కాల పరిమితి ముగిసిన అగనంపూడి టోల్ గేట్లు విజయనగరం జిల్లా చెల్లూరు వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన టోల్ గేట్లను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 3న విశాఖలో జరుగు కార్మిక ప్రదర్శన బహిరంగ సభల్లో ఆటో అండ్ మోటార్ కార్మికు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాలకు కళ్ళు తెరిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టాండ్ అధ్యక్షులు పి.అప్పలరాజు, ఎం.రాజేష్, కే.శ్రీను, బి.రాజేష్, ఎస్.చిన్నారెడ్డి, వై.వెంకట్, హెచ్.శేఖర్, జె.గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయస్సు పెంచండి

పురపాలక శాఖామంత్రి నారాయణకి వీఎంఆర్డీఏ ఉద్యోగుల వినతి

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సును రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెంచినట్టుగా 60 నుండి 62 సంవత్సరాలకు పెంచాలని కోరుతూ వీఎంఆర్డీఏ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి పి. నారాయణకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు యువిఆర్ ఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్స్ ఎం.రవికుమార్, వీఆర్ రవి శంకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణను కలిసిన రమణారెడ్డి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: విశాఖపట్నం జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మున్సిపల్ పురపాలక శాఖా మంత్రి పొంగూరి నారాయణని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి కలిశారు. భీమిలి శాసన సభ్యులు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశాఖకు అవసరం అయిన నిధులు కేటాయించి విశాఖ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని ఉధృతం చేస్తాం

పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ఉక్కు పరిరక్షణకు పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ స్పష్టం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్న పాలెం కూడలిలో చేపడుతున్న రిలే దీక్షలు మంగళవారం 1293వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను సమీకరించి ఉద్యమాలను చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తామని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేసి ఉక్కును కాపాడాలని అన్నారు. ఉక్కు మన సంపదని, ఈ సంపదను కొల్లగొట్టే ప్రయత్నాలను కేంద్రం మానుకోవాలని అన్నారు. ఉక్కు కర్మాగారం 32 మంది ఆత్మ బలిదానంతో ఏర్పాటైందన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే దిగి రాకపోతే కార్మిక ఆగ్రహానికి గురి కాక తప్పదన్నారు. ఈ దీక్షల్లో మసేన్‌రావు, కె.రాజబాబు, జి.జయ, తాండ్ర కనకరాజు, ఏ.శివ రామ కృష్ణ, తుమ్మల శ్రీనివాస్, జి.ఆనంద్, కర్రి బాబురావు, ఎం.శ్రీనివాసు, డి.దేముడు, ఘంటా రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ నూతన రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావుకు శుభాకాంక్షల వెల్లువ

విశాలాంధ్ర - విశాఖపట్నం: ప్రతిష్టాత్మక ఆంధ్ర యూనివర్సిటీకి నూతన రిజిస్ట్రార్‌గా ఆచార్య ఈఎన్ ధనుంజయరావు బాధ్యతలు స్వీకరించినందుకు ఆంధ్ర యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ శుభాకాంక్షలు తెలిపింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కోడి అర్జునుడు మాట్లాడుతూ ఆచార్య ధనుంజయరావును రిజిస్ట్రార్‌గా ప్రభుత్వం నియమించటం కాంట్రాక్ట్ అధ్యాపకులకు శుభ సూచికమన్నారు. గత 20 సంవత్సరాలుగా యూనివర్సిటీలో ఎన్నో బాధలను కష్టాలను ఓర్చుకుంటూ యూనివర్సిటీ కోసం నిరంతరం పనిచేస్తున్న తమ విషయాలపై పూర్తి అవగాహన కలిగిన ఆచార్యులు రిజిస్ట్రార్‌గా రావటం చాలా ఆనందదాయకమన్నారు. కొన్ని పత్రికలలో మాజీ వైస్ ఛాన్సలర్ మనుషులకే మరలా కూటమి ప్రభుత్వం కూడా పట్టం కట్టిందని ప్రచురించటాన్ని పూర్తిగా ఆంధ్ర యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ తరపున ఖండిస్తున్నామన్నారు. ఆచార్య ధనుంజయరావు ఒక అకడమిషియన్‌గా, అడ్మినిస్ట్రేటర్‌గా యూనివర్సిటీ అభివృద్ధి కోసం ప్రపంచ స్థాయిలో గుర్తింపును తీసుకురావడానికి తనకున్న సామర్థ్యాన్ని నిరంతరం యూనివర్సిటీ కోసం కష్టపడే వారని ఆ క్రమంలోనే తనకు ఇచ్చిన బాధ్యతలను శిరసా వహిస్తూ అహర్నిశలు యూనివర్సిటీ సేవకు అంకితం అయ్యారని అంతేకాని వారిని మాజీ వైస్ ఛాన్సలర్ మనిషి అని ప్రచురించటం శోచనీయం అని దీనిని పూర్తిగా మరొక్కసారి ఖండిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆలీ, ట్రెజరీ డాక్టర్ హరీష్, డాక్టర్ బి.సుబ్బయ్య, డాక్టర్ సాల్మన్, డాక్టర్ రాము, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ నరసింహమూర్తి, డాక్టర్ దొర, డాక్టర్ రతన్ రాజు మహిళా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1 నుండి ఆసుపత్రి కార్మికులు దశలవారి ఆందోళన

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖ జిల్లాలో అగనంపూడి, పెందుర్తి, గోపాలపట్నం, భీమిలి సిహెచ్‌సి ప్రభుత్వ ఆసుపత్రిల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్, చెదల పురుగు నివారణ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు లేవని వెంటనే జీతాలు మంజూరు చేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని లేకుంటే విధుల బహిష్కరణ తప్పదని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ హెచ్చరించారు. మంగళవారం విశాఖ జిల్లా, పెందుర్తి ఆసుపత్రిలో డిసిహెచ్ అధికారి శంకర్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని కార్మికులు సమర్పించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ ఒక్క రోజు అద్దె పెండింగ్లో ఉంటే ఇల్లు ఖాళీ చేయమంటున్నారని అదేవిధంగా చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని నడపడం చాలా కష్టంగా ఉందన్నారు. ఇటువంటి తరుణంలో మూడు నెలలుగా జీతాలు మంజూరు చేయకపోతే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవో ప్రకారం కనీస వేతనం 16 వేలు ఇవ్వాలని గత కొన్ని నెలలుగా విజ్ఞప్తి చేస్తున్నా స్పందన లేదని ఆయన పేర్కొన్నారు. ఇక తప్పని పరిస్థితుల్లో వచ్చే సెప్టెంబర్ 1 నుంచి నల్ల బ్యాడ్జి ధరించి నిరసనలు, 15 నుంచి విధులు బహిష్కరణ చేస్తామన్నారు. శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులందరికీ బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలని అన్నారు. పలు డిమాండ్స్‌తో కూడిన సమ్మె నోటీసును డిసిహెచ్ శంకర్ ప్రసాద్‌కు, పెందుర్తి సూపరింటెండెంట్ అవంతికలికు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మధు, ఆసుపత్రి కార్మికులు భవాని, నమ్మి లక్ష్మి, కుమార్, అప్పారావు, గురమ్మ, పి.లక్ష్మి, రాజేష్, ఎన్.లక్ష్మి, వరలక్ష్మి, కమలమ్మ, నాయుడు, బి.లక్ష్మి కుమారి పాల్గొన్నారు.

పలు వార్డుల్లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర -గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 91వ వార్డ్ పాత గోపాలపట్నం, హరిజన కాలనీ, 89వ వార్డ్ చంద్రనగర్, 56వ వార్డ్ చాకలి గెడ్డ, 57వ వార్డ్ శ్యామ్ నగర్ కాలనీ, 92వ వార్డ్ వెంకటా పురంలో రైల్వే అధికారులు, జీవీఎంసీ అధికా రులతో విశాఖ పశ్చిమ శాసనసభ్యులు గణబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోడ్ నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, పైపులైన్ పనులు నిర్మాణం చేపట్టాలని, చంద్రనగర్, అండర్ పాత్ మార్గంలో నీటి నిల్వల నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవడం, వెంకటాపురం నుండి కొత్తపాలెం 5 మదుముల రోడ్ నిర్మాణం మరమ్మతులకై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో టీడీపీ వార్డ్ కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, శరగడం రాజశేఖర్, రైల్వే అధికారులు, జీవీఎంసీ అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బొడ్డేటి విజయ్, నందవరపు సోములు, బంగారు తులసిరామ్, కంపర ఆనంద్, పెంటకోట అజయ్, నరవ అనూష, ప్రదీప్ లత, పద్మ, పెప్సీ రమణ, డాడీ సురేష్, గొంతున శ్రీను, గవ్వ భాస్కర్, తతబాబు, నునేల రామారావు, పట్నాల అరుణ్, రంజిత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబును కలిసిన ఉప్పాడ

విశాలాంధ్ర - పద్మనాభం: మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు విశాఖపట్నం దశపల్లాలోని వారి నివాసం వద్ద మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ అప్పారావు, రాష్ట్ర మెడికల్ కన్వీనర్ రూపాకుల రవికుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. హరి బాబు మాట్లాడుతూ ప్రపంచంలో భారత దేశాన్ని శక్తివంతమైన దేశంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ తీర్చిదిద్దుతున్నారని ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జోన్ 3 పోలాకి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పరదేశి పాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్, 11 కెవి బోయపాలెం, 11 కెవి కేకే పాలెం లైన్ వర్క్స్ నిమిత్తం బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బోయపాలెం, గంభీరం, కొత్త కల్లివానిపాలెం తదితర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ సురేష్ కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ పరిధిలో గొల్లలపాలెం వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. పశువులు కాసుకుని ఒక మహిళకు చెట్టు పొదల్లో మృతదేహం కనిపించగా వెంటనే స్థానిక సచివాలయం పోలీస్‌కు సమాచారం అందించగా వెంటనే మహిళ పోలీస్ స్థానిక ఆనందపురం పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం వద్దకు చేరుకున్న పోలీసులు సుమారు నెలరోజులకు పైగా చనిపోయి ఉండొచ్చని వివరాలు ఇంకా ఏమి తెలియవని అలాగే సంఘటన ఎలా జరిగింది అనే విధంగా డాగ్స్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్స్ పరిశీలన చేస్తున్నామని పోస్టుమార్టం నిమిత్తం బాడిని భీమిలి హాస్పటల్‌కి పంపిస్తున్నామని సిఐ తిరుపతిరావు ఆదేశాల మేరకు సబ్ ఇన్స్పెక్టర్ గంట్యాడ సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పండుగ సీజన్ సందర్భంగా అమెజాన్ ఇండియా రాయితీలు

విశాలాంధ్ర -విశాఖపట్నం: అమెజాన్ ఇండియా ఈరోజు తమ మార్కెట్‌ప్లేస్‌లో బహుళ ఉత్పత్తుల విభాగాలలో విక్రయ రుసుముల పై గణనీయమైన తగ్గింపును ప్రకటించింది. సెప్టెంబరు 9, 2024 నుండి ఇది అమలులోకి వస్తుంది, ఫీజు తగ్గింపులు రాబోయే పండుగ సీజన్‌కు సిద్ధమవుతున్న విక్రేతలకు సకాలంలో ప్రోత్సాహాన్ని అందిస్తాయి. ఫీజులను తగ్గించడం ద్వారా, అమెజాన్ అన్ని పరిమాణాల విక్రయ దారులతో తన భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది అమెజాన్ డాట్ ఇన్ లో విక్రయదారులు తమ ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను విస్తరించు కోవడానికి వారి వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఈ మార్పులతో, అమెజాన్ ఇండియా పై వున్న విక్రేతలు వివిధ ఉత్పత్తుల విభాగాలలో 3 శాతం నుండి 12 శాతం వరకు విక్రయ రుసుము తగ్గింపు నుండి ప్రయోజనం పొందుతారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో గంభీరం, ఐఐఎం రోడ్ మంగళవారం హరే కృష్ణ వైకుంఠంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి మరుసటి రోజు సందర్భంగా శ్రీ నంద మహా రాజు తనకు కుమారుడు జన్మించారని ప్రజలందరితో కలసి ఉత్సవమును నిర్వహించి, దీనిని నందోత్సవంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి మరుసటి రోజు హరే కృష్ణ మూవ్మెంట్ జరిపారు. హరే కృష్ణ మూవ్మెంట్ వ్యవస్థాపక గురువు భక్తి వేదాంత స్వామి ప్రభుపాద 128వ ఆవిర్భావ దినోత్సవం (పుట్టిన రోజును) పురస్కరించుకొని వారి విగ్రహానికి అభిషేకము నిర్వహించారు.

బెస్పోక్ ఏఐ వాషింగ్ మెషీన్‌లను విడుదల చేసిన సామ్‌సంగ్

విశాలాంధ్ర-విశాఖపట్నం: భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్ , ఈరోజు తమ కొత్త శ్రేణి 10 పెద్ద-పరిమాణ, ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్‌లను విడుదల చేసింది. ఏఐ -ఆధారిత లైనప్ భార తీయ వినియోగదారులకు లాండ్రీ సంరక్షణలో కొత్త శకానికి వాగ్దానం చేస్తుంది. సహజమైన ఏఐ లక్షణాల ద్వారా లాండ్రీని సరళమైన పనిగా మారుస్తుంది. కొత్త, పెద్ద వాషింగ్ మెషీన్లు 12 కేజీల ఆదర్శ పరిమాణంలో వస్తాయి, భారతీయ వినియోగదారులను ఒకేసారి పెద్ద లోడ్ లను ఉతకటానికి వీలు కల్పిస్తుంది, దుప్పట్లు, కర్టెన్లు మరియు చీరలు వంటి పెద్ద వస్తువులకు వాటిని ఆదర్శంగా మారుస్తుంది. సామ్‌సంగ్ ఇండియా యొక్క కొత్త 12 కేజీల ఏఐ వాషింగ్ మెషీన్‌ల శ్రేణి రూ. 52990 వద్ద ప్రారంభమవుతుంది.

ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ఆన్లైన్ క్లాస్‌లో భీమిలి కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం మండలం కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న బండారు ప్రవలిక, 9వ తరగతి చదువుతున్న చప్పగడ్డ దీపిక ఇన్ఫోసిస్ వారి ఆన్లైన్ లెర్నింగ్ ప్లాట్ ఫారం అయిన ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డులో ఉన్న టైమ్ మేనేజ్మెంట్‌కి సంబంధించి టైం మేనేజ్మెంట్, ఎలక్ట్రానిక్స్, హార్డ్వేర్, సాఫ్ట్ వేర్ తదితర కోర్సులు ఆన్లైన్లో చేసి 100 సర్టిఫికెట్లు సంపాదించారు. విద్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ జి.మహాలక్ష్మి లక్ష్మి సహకారంతో ఈ ఆన్లైన్ కోర్సులు విద్యార్థినులు చేయగలిగారు. భవిష్యత్ కాలంలో ఐటి ఉద్యోగాలకు ఆయా కోర్సులకు సంబంధించిన కంపెనీల్లో ఉద్యోగాలకు ఈ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయని విద్యాలయం ప్రిన్సిపాల్ గంగా కుమారి తెలియజేశారు. 100 సర్టిఫికెట్స్ సంపాదించిన విద్యార్థినులిద్దరినీ సమగ్ర శిక్షా ఏపిసి శ్రీనివాసరావు, జిసిడిఓ కలిషా బేగం, ప్రిన్సిపాల్, విద్యాలయం సిబ్బంది అభినందించారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై అవగాహన

విశాలాంధ్ర - భీమిలి: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదుకు సంబంధించి భీమిలి అర్బన్ మండలం 3,4 డివి జన్‌ల నాయకులతో అవగాహన సదస్సు జరిగిందని మండల అధ్యక్షుడు బత్తిన వెంకట రమణ తెలియజేశారు. ఈ సమావేశంలో భీమిలి నియోకవర్గం కన్వీనర్ కంటుభుక్త

రామానాయుడు, మత్స్యకార సెల్ జిల్లా కన్వీనర్ వాసుపల్లి శ్రీహరి పాల్గొని మాట్లాడుతూ మండలంలోని నాయకులకు సాధారణ, క్రియాశీల సభ్యత్వం ఏ విధంగా చేయాలన్న దానిపై అవగాహన కల్పించడం జరిగింది. జీవీఎంసీ 3, 4 డివిజన్ లలో 8 వేలు సభ్యులను చేర్పించే విధంగా ప్రణాళిక రచించు కోవాలని పాల్గొన్న డివిజన్ నాయకులకు తెలియజేసారు. ఈ సభ్యత్వ నమోదు అవగాహన సదస్సులో మూడో డివిజన్ అధ్యక్షురాలు కంటుభుక్త సునీత, నాలుగో డివిజన్ అధ్యక్షులు ఊళ్ళ కొండబాబు, నాయకులు పోలుబోతు విజయ, కురిమెళ్ళ కవిత, అప్పికొండ ఆదినారాయణ, చెన్నా రాము, పాసి అప్పల నాయుడు, కురిమెళ్ళ వెంకటేశ్వరావు, వాసుపల్లి పృధ్వి, జరజాపు అప్పలకొండ, పతివాడ హరీష్, దొకర లక్ష్మి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సింగపూర్‌లో ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్ సీజన్ 2 బృందం

విశాలాంధ్ర/విశాఖపట్నం: ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్: ది రింగ్స్ ఆఫ్ పవర్ సీజన్ 2 బృందం ఈ సీరీస్ ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతున్న తరుణంలో సింగపూర్‌లో 3 ఆసక్తికరమైన రోజులు గడిపింది. ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్: ది రింగ్స్ ఆఫ్ పవర్ సీజన్ 2 ప్రైమ్ వీడియోపై ఆగస్ట్ 29న ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మళయాళం, మరెన్నో భాషలలో 240 పైగా దేశాలలో ప్రీమియర్‌గా ప్రసారం అవుతుంది. ఈ సందర్భంగా నటీనటులు, నిర్మాణకర్తలు ఒక ప్రత్యేక ఆసియా పసిఫిక్ స్క్రీనింగ్ కొరకు సింగపూర్ వెళ్ళారు. తారాగణం అందరితో నిండిన ఈ ప్రీమియర్‌లో షో రన్నర్ జే.డి.పేన్, దర్శకుడు షార్లొట్ బ్రాండ్‌స్ట్రార్మ్, చార్లీ వికర్స్, లాయడ్ ఓవెన్, మెగాన్ రిచర్డ్స్, మార్కెల్లా కావెనాఫ్, చార్ల్స్ ఎడ్వర్డ్స్, ఇస్మేల్ క్రుజ్ కార్డోవ, టైరో ముహాఫిదిన్, ట్రిస్టాన్ గ్రావెల్లెలతో సహా ప్రతిభ కలిగిన నటీనటులు అంతా హాజరు అయ్యారు. వారి యాత్ర సమయములో, ఈ బృందం ఒక ప్రత్యేక స్క్రీనింగ్‌కు హాజరు అయ్యింది. ఇందులో జపాన్, థాయ్‌ల్యాండ్, ఇండోనేషియా, సింగపూర్, ఫిలిప్పైన్స్, ఇండియా నుండి మీడియాతో పాటు ఫ్రాంచైజ్, ఫాన్స్ కూడా పాల్గొన్నారు. ఈ ముఖ్యమైన కార్యక్రమాన్ని అమెజాన్ ప్రైమ్ వీడియో ఎస్ఈఏ, ఎంఈఎన్ఏ డైరెక్టర్, డేవిడ్ సైమాన్సెన్ ప్రారంభించారు.

ఎంజి విండ్సర్ నుంచి మొదటి సీయూవీ వెహికల్

విశాలాంధ్ర /విశాఖపట్నం: జేస్ డబ్ల్యూ ఎంజి మోటార్ - ఎంజి విండ్సర్, భారతదేశపు మొదటి క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ ను అందుబాటులోకి తెస్తున్నట్లు సంస్థ ప్రతినిదులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఉప్పు ఎడారులలో ఒకటైన రన్ ఆఫ్ కచ్ లోని 44%శీజ%కి పైగా తీవ్రమైన వేడిలో తన ఇంజనీరింగ్ శ్రేష్టతను వెల్లడించిందన్నారు. ఈ తీవ్రమైన పరిస్థితిలో ద ఇంటిలిజెంట్ సీయూవీ ప్రయాణం తన దృఢమైన డిజైన్, ఆధునిక టెక్నాలజీ, సాటిలేని సామర్థ్యానికి నిరూపణ అన్నారు. కఠినమైన సవాళ్లను తట్టుకునే విధంగా రూపొందించబడిన ఈ పరీక్ష నేలను ఆక్రమించడమే కాకుండా, వాస్తవిక ప్రపంచ పరిస్థితులలో విండ్సర్ ఆధిపత్యం మరియు నైపుణ్యాన్ని కూడా సుస్థిరపరుస్తుందన్నారు. ఈ ఆధునిక ఫీచర్స్ యొక్క ఈ కలయిక ఆచరణీయత పనితీరులో రాజీ లేని ప్రీమియం డ్రైవింగ్ అనుభవాన్ని కోరుకునే భారతదేశపు వినియోగదారులకు ప్రధానమైన ఎంపికగా ఎంజి విండ్సర్ ను మార్చిందన్నారు. అత్యధిక గ్రౌండ్ క్లియరెన్స్ స్పీడ్ బంప్స్, గుంతలు, సమానంగా లేని ఉపరితలాలు పై మెరుగ్గా ప్రయాణించడానికి అనుమతి ఇస్తుంది, సాఫీ మరియు మరింత సౌకర్యవంతమైన డ్రైవ్ ను కేటాయిస్తుందన్నారు.

ముచ్చర్ల పంచాయతీలో సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం ముచ్చర్ల గ్రామపంచాయతీలో పలు సమస్యలపై జనసేన నాయకులు, స్థానిక కార్యదర్శి వినతి పత్రం సమర్పించారు. అందులో భాగంగా ముఖ్యంగా సిమెంట్ రోడ్ నిర్మాణాలు, సైడ్ కాలువలు, మంచినీళ్ల ట్యాంకు ఇంటింటికి కులాయి, శ్మశాన వాటిక షెడ్లు నిర్మాణం, ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువుకు అనుసంధానంగా ఉన్న గెడ్డ వాగులను పూర్తిగా శుభ్రపరచాలని అప్పుడే వర్షాధార నీరు నేరుగా చెరువులోకి వెళ్తుందని, పంచాయతీ పరిధిలో మట్టి రోడ్ల నిర్మాణం పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియ మొదలగు అంశాల గురించి పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్‌కు తెలియపరిచారు. కార్యక్రమంలో సర్పంచ్ షినగం ఎర్రయ్య, మాజీ సర్పంచ్ లెంక అప్పలనారాయణ, ఎంపీటీసీ గుసిడి ముత్యాలు, మాజీ ఎంపీటీసీ బుంగ అప్పారావు, లెంక శంకర్రావు, షినగం బంగారునాయుడు, శివ, చిన్నయ్య, పాండ్రంకి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతంగా డిశ్చార్జ్ అయిన 42 మంది చిన్నారులు

ఇటీవల విషాహారం తిని కేజీహెచ్‌లో చేరిక ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా మెరుగైన వైద్య సేవలు అందించిన కేజీహెచ్ పిల్లల వైద్య నిపుణులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విషాహారం తిని తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరిన 42 మంది చిన్నారులకు ఎలాంటి నష్టం జరగకుండా డిశ్చార్జ్ అయిన సందర్భంగా అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆగస్టు 19న ఆహార విష ప్రభావం వల్ల తీవ్రమైన వాంతులు, అతిసారంతో బాధపడుతున్న 42 మంది పిల్లలను కేజీహెచ్ పిల్లల విభాగంలో చేర్చడం జరిగింది. వీరిలో ఎక్కువ మంది చాలా క్రిటికల్‌గా ఉండి, వారికి గట్టి పర్యవేక్షణ, ఇంటర్వెన్షన్‌లు అవసరమయ్యాయి. ఇందులో ఐ.వి ఫ్లూయిడ్స్, ఇనోట్రోప్స్, యాంటిబయాటిక్స్, ఇతర సహాయక చర్యలు ఉన్నాయని, ఇవి ఎంతో అవసరమైననూ, ఈ పిల్లలలో చాలామంది రెనల్ రక్త ప్రవాహం తగ్గిపోవడం వల్ల తీవ్రమైన మూత్రపిండాల సమస్యలు కూడా ఏర్పడిందని, హైపోకాలిమియా కూడా తలెత్తిందని, రక్తపోటులో మార్పులు కూడా వారి నిర్వహణను మరింత సంక్లిష్టం చేశాయని, తద్వారా రౌండ్-ది-క్లాక్ పర్యవేక్షణ, కచ్చితమైన జోక్యాలు అవసరమయ్యాయని కేజీహెచ్ పీడియాట్రిక్స్ విభాగ అధిపతి డాక్టర్ బిఎస్ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం పిల్లలందరికీ నయం కావడంతో వారికి అందించిన వైద్య సేవలపై ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ అత్యవసర సమయంలో ఏపీ జుడా సమ్మె సిబ్బంది కొరత ఉన్నప్పటికీ, మా విభాగం రెసిడెంట్లకు చేసిన పిలుపునకు పీజీ వైద్యులు అమోఘంగా స్పందించారు. ప్రతి రెసిడెంట్ ఈ అత్యవసర పరిస్థితుల్లో పాల్గొని పిల్లలను జాగ్రత్తగా పర్యవేక్షించారు. మా సీనియర్, జూనియర్ ఫ్యాకల్టీ సభ్యులు అత్యున్నత అంకిత భావంతో, అత్యున్నత స్థాయిలో సంరక్షణ, చికిత్స అందించామన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద మూడురోజులు 24/7 మాతో కలిసి ఉంటూ, నిరంతరం సేవలందించారని, ఈ సంక్షోభ సమయంలో ఆయన మద్దతు, సమన్వయం అమూల్యం, అందరూ అవసరమైన అవసరాలను వెంటనే తీర్చడం జరిగిందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు నిరంతరం అన్ని ఫ్యాకల్టీ సభ్యులను మరియు విద్యార్థులను కష్టపడి పని చేయమని ప్రోత్సహించారన్నారు. జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ సహాయ సహకారాలు అందించారన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు స్వయంగా మొత్తం ప్రక్రియను పర్యవేక్షించారు. నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, చీఫ్ డైటీషియన్ రమణ మూర్తి, ట్రైబల్ కోఆర్డినేటర్ ఆఫ్ కేజీహెచ్ డాక్టర్ మౌలి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్, ఆర్ఎంఓ డాక్టర్ దవల భాస్కర్ అందరూ ఈ ప్రాణ రక్షణ ప్రయత్నంలో కీలక పాత్రలు పోషించారు.

ఎంటిఎస్, ఎన్ఎంఆర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

మంత్రి నారాయణకు జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ వినతి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణకు జి.వి.యం.సి. ఎంప్లాయీస్ యూని యన్ గౌరవ అధ్యక్షులు ఎం.ఆనందరావు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు, ఉద్యోగుల, సచివాలయ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై మంగళవారం వుడా కార్యాల యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జి.వి.యం.సి.లో సుమారు 30 సంవత్సరముల నుండి పనిచేస్తున్న ఎం.టి.ఎస్ , ఎన్.ఎం.ఆర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరగా, రాష్ట్ర వ్యాప్తంగా జి.ఓ.ఎం.ఎస్.నెం.212 కు ఎంత మంది అర్హత పొందుతారని మంత్రి అడగగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 800 మంది ఉంటారని యూనియన్ నేతలు తెలియజేశారు. మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న ఇంజనీరింగ్, వాటర్ సప్లై ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్-స్కిల్డ్ వారికి రూ.21,000/-, సెమి-స్కిల్డ్ వారికి రూ. 24,500/, జి.ఓ.ఎం .ఎస్.నెం.36, తేది.01-03-2024 ప్రకారం చెల్లించాలని, గత 20 సంవత్సరాలుగా ఎం.ఎ.యు.డి. డిపార్ట్మెంట్‌లో పి.హెచ్. నాన్ -పి.హెచ్. వర్కర్లకు ఒకే రకమైన జీతములు ఉండేవని వివరించగా, అందుకు మంత్రి ఇదే లెటర్ గతములో తన వద్దకు వచ్చినదని, సెప్టెంబర్ చివరికల్లా మీ డిమాండ్ల మీద జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి, రెండు నెలల్లో సమస్యలు పరిష్కారం చేస్తానని తెలియజేసారు. ఆప్కోస్‌లో పనిచేయు చున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, మున్సిపల్ శాఖలో పనిచేయుచున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎంటీఎస్ అమలు చేయాలని కోరగా, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. 2024, జనవరి ఎన్నికల్లో వివిధ పార్టీలకు అనుగుణముగా పనిచేశారని సస్పెండ్ చేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను మానవతా దృక్పథంతో తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరగా, సంబంధిత అధికారుల నుండి వివరాలు సేకరించి తగు చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జి.వి.యం.సి. ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొట్టా యర్రాజి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.వి.కుమార్, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రెల్లి సత్య, మలేరియా విభాగం నుండి కన్నబాబు, శివ, డ్రైవర్స్ అసోసియేషన్ నుండి బోని రామకృష్ణ, పి.కనక రాజు, వాటర్ సప్లై విభాగం నుండి ఇ.రామకృష్ణ, ఎం.బంగారురాజు, జీవన్, రవి తదితర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అభివృద్ధికి పెద్దపీట

రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎండి గుమ్మల గణేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నిరుద్యోగ యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణలో భాగంగా మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లాలో ఉన్నటువంటి ఐటీ, టెక్ మహేంద్రలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారుగా 50 పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండి, సీఈవో గుమ్మాల గణేష్ కుమార్ మాట్లాడుతూ వ్యక్తులకు, పరిశ్రమలకు అవస రమైన నైపుణ్యాలను (స్కిల్ గ్యాప్) గుర్తించడానికి, ఒక వివరణాత్మక అంచనా కోసం డేటా సేకరణ చేయడం కోసం ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆదేశాల మేరకు నైపుణ్య శిక్షణ నిర్వహించడం జరుగు తుందన్నారు. ప్రస్తుత శ్రామిక శక్తి, జనాభాను అర్థం చేసుకోవడానికి, నైపుణ్యాల సరఫరాను మ్యాపింగ్ చేయడానికి ప్రభుత్వం సర్వేలు నిర్వ హించాలని ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. వివిధ ఐటీ పరిశ్రమల ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ చాలా సానుకూలంగా స్పందించారని, నైపుణ్య శిక్షణలపై సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ఎండి గుమ్మాల గణేష్ కుమార్, దినేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సాయి కృష్ణ చైతన్య, జిల్లా నైపు ణ్యాభివృద్ధి అధికారి, విశాఖపట్నం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక సదస్సు నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన జేసీ కె.మయూర్ అశోక్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 29వ తేదీన విశాఖలోని నోవోటెల్ వేదికగా జరగనున్న ఆర్థిక సదస్సు (సర్క్యులర్ ఎకానమీ - పాలసీ టు ఇంప్లిమెంటేషన్)కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, అందరూ సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం వివిధ విభాగాల అధికారులతో స్థానిక నోవోటెల్ అవెన్యూ హాలులో అధికారులతో సమీక్షించారు. ఇప్పటి వరకు ఎవరెవరూ ఏయే పనులు చేపట్టారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. విశాఖ వేదికగా జరిగే ఆర్థిక సదస్సు చాలా ప్రత్యేకమైనదని, దేశం నలుమూలల నుంచి వివిధ రంగ నిపుణులు భాగస్వామ్యం అవుతున్నారని, అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ పక్కా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అతిథులకు ఎలాంటి ఇబ్బందుల రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. 28వ తేదీ సాయంత్రానికి అతిథులంతా వాయు మార్గం ద్వారా విచ్చేస్తారని, దీనికి సంబంధించి ఎయిర్ పోర్టు వద్ద హెల్ప్ డెస్కు, రిసెప్షన్ డెస్కు ఏర్పాటు చేయాలని సూచించారు. వారికి కేటాయించిన హెూటళ్లకు లైజన్ అధికారుల సాయంతో తీసుకెళ్లాలని, కార్యక్రమం ముగిసేంత వరకు లైజన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలు, వసతి, ఆహారం ఇతర ఏర్పాట్లను పక్కాగా చేయాలని ఆదేశించారు. మెడికల్ క్యాంపు పెట్టాలని, వైద్యాధికారులను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమానికి సంబంధించి ఏమైనా సందేహాలు, సమాచారం ఉంటే కలెక్టరేట్ నుంచి పని చేసే కంట్రోల్ రూమ్ ను సంప్రదించాలని సూచించారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో డి. హుస్సేన్ సాహెబ్, కలెక్టరేట్ ఏవో కె.వి. ఈశ్వరరావు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న సైలెంట్ డిహైడ్రేషన్ కేసులతో అప్రమత్తత అవసరం

డిహైడ్రేషన్ వర్క్ షాప్‌లో వైద్యులు

విశాలాంధ్ర - విశాఖపట్నం:-గత దశాబ్ద కాలంలో, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఆంధ్రప్రదేశ్లో 1,788 మందికి పైగా ప్రాణాలను బలిగొన్నాయని, ఎక్కువగా ప్రభావితమైన ప్రాంతాలలో ఒకటిగా వైజాగ్ (విశాఖపట్నం) అవతరించిందని ఎస్ కె క్లినిక్స్ ఇంటర్నల్ మెడిసిన్ ఫిజిషియన్ డాక్టర్ లోకనాథ్ త్రిపాఠి, హ్యాపీ క్లినిక్ ని ఇంటర్నల్ మెడిసిన్ ఫిజిషియన్ డాక్టర్ ఎమ్‌విఙ రామా నాయుడు తెలిపారు. మంగళవారం విశాఖ లోని ఓ హెూటల్‌లో జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ ఎడతెగని ఉష్ణోగ్రతలు వేడి గాలుల మధ్య పెరుగుతున్న, తరచుగా పట్టించుకుని ఆరోగ్య సంక్షోభం సైలెంట్ డిహైడ్రేషన్ (నిశ్శబ్ద నిర్జలీకరణం) దానివల్ల అనేది పెరుగుతుందన్నారు. వైజాగ్ లో ఈ ఏడాది ఏప్రిల్ లో 43.4 డిగ్రీల సెంటిగ్రేట్‌కు పైగా గరిష్ట స్థాయిని నమోదు చేసిందన్నారు. విపరీతమైన తేమ కారణంగా ఉష్ణోగ్రతలు తరచుగా 50 డిగ్రీల సెంటిగ్రేట్‌కి చేరుకునే అవకాశాలు ఉన్నాయన్నారు.